ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 162 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 30 సెప్టెంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## ప్రధాని మోడీ అమిత్ షా
# రాజీనామా చేయాలి







### దేశంలో 13.30 కోట్ల ఓట్లను పునరుద్ధరించాలి
### సిఈసి జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలి
### సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ తీర్మానం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (ప్రభాత ఉదయం)**

ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాన్ని ఆమోదించారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రధాని, ఎన్నికల సంఘం మధ్య జరుగుతున్న 'మ్యాచ్ ఫిక్సింగ్'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని, హోంమంత్రి తరఫున ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని తీర్మానంలో పేర్కొంది. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన 13.30 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో దాదాపు 25 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షం మాత్రమే కాదని, అది ఒక 'ప్రతిఘటన' పార్టీ అని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం తాము చేసే పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంతో సమానమని తీర్మానంలో ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు పార్లమెంటు, న్యాయస్థానాలు, వీధుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తా మని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎన్నికల్లో రెండు రకాల 'మ్యాచ్ ఫిక్సింగ్' జరుగుతోందని రాహుల్ ఆరోపిం చారు. ఒకటి ఈవీఎంలకు సంబంధించినదైతే, రెండోది ఓటర్ల జాబితా ల్లో ఉద్దేశపూర్వకంగా మార్పులు చేయడమని ఆయన పేర్కొన్నారు. 2024 ఎన్నికలు పూర్తిగా ఫిక్స, రిగ్డ్ అయ్యాయని కూడా ఆయన ఆరోపణలు చేశారు. గత కొంతకాలంగా కాంగ్రెస్ ఓట్ చోరీ అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తోంది. హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని పార్టీ ఆరోపిస్తూ వస్తోంది. మొదట్లో ఆ అంశాలపై చాలామంది అనుమానాలు వ్యక్తం చేసినా, ఇప్పుడు మీడియా, సంపాదకీయాల్లో కూడా ఎన్నికల ప్రక్రియపై చర్చ జరుగుతోందని రాహుల్ చెప్పారు.ప్రస్తుత ప్రభుత్వం ప్రజల గొంతును పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ భావిస్తోందని రాహుల్ గాంధీ సమావేశంలో చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని నమ్మే పార్టీలు ప్రతిఘటన మార్గంలో ముందుకు సాగాల్సిందేనని ..మిగతా 2లో



# ప్రాజెక్టులకు అనుమతివ్వండి

### కృష్ణా జలాల జలాల వినియోగంపై...
### టెలీమెట్రీలు ఏర్పాటు చేయండి
### పీఆర్ఎల్ఐఎస్, సీతారామ ప్రాజెక్టులకు అనుమతివ్వండి
### జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ రెడ్డి వినతి
### మంత్రి సీఆర్ పాటిల్‌తో సిఎం రేవంత్ రెడ్డి సమావేశం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (ప్రభాత ఉదయం)**

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో వారు చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ౦152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించేందుకు వీలుంటుందని తెలిపారు. దాంతో నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, విద్యుత్ వ్యయం తగ్గుతుందని వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్), సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు (ఎస్ఎస్ ఎంపీ), గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల ..మిగతా 2లో

# నేడు సిరిసిల్లకు రేవంత్

### రూ.345.78 కోట్ల పనులకు సిఎం శ్రీకారం.. బహిరంగ సభపై సర్వత్రా నెలకొన్న ఆసక్తి




**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాజకీయాల్లో సిరిసిల్ల ఇప్పుడు మరోసారి హాట్‌టాపిక్గ్గ మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సీఎం హోదాలో ఆయన తొలిసారి సిరిసిల్లకు రావడం ఒకవైపు అయితే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ నిర్వహించనుండటం మరోవైపు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పర్యటనలో రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో విద్య, ఆలయ అభివృద్ధి, పరిపాలనా మౌలిక వసతులు, మహిళా సాధికారత, నేతన్నల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలు ఉన్నాయి. సిరిసిల్లకు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైనట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది.సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా సుమారు రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వేములవాడలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు సీఎం రేవంత్ శంకుస్థాపన చేయనున్నారు. పెద్దూరులో సుమారు 18 ఎకరాల్లో నిర్మించనున్న ఈ విద్యా సముదాయంలో 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు వసతి, తరగతి గదులు, డార్మిటరీలు, డైనింగ్, క్రీడా సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. సిరిసిల్ల, కోనరావుపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఆధునిక తరగతి గదులు, ల్యాబ్‌లు, డైనింగ్ హాళ్లు, క్రీడా సదుపాయాలు, ఐటీ మౌలిక వసతులు కల్పించనున్నారు.



## దురుసుగా ప్రవర్తించిన
# పోలీసులను గుర్తించండి

### అసెంబ్లీ వద్ద ఘటనపై డీజీపీకి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆ అధికారుల వివరాలను సేకరించి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు సూచించింది. సెప్టెంబర్ 7న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఈ ఘటన చోటుచేసుకుంది. నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలిపేందుకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యేలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ ఘటనలో తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాధ్యులైన అధికారులపై అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని స్పష్టం చేసింది. ఒక మహిళా ఎమ్మెల్యే చీర లాగారని, మాజీ హోంమంత్రిగా పనిచేసిన మరో మహిళా ఎమ్మెల్యేను మెడ పట్టుకుని నెట్టారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ్యులను అసెంబ్లీలోకి వెళ్లకుండా నిలువరించే హక్కు పోలీసులకు లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు ని ..మిగతా 2లో

## ప్రతిపక్ష నేతలు గాలిలో
# కత్తులు తిప్పుతున్నారు

### నోరు జారితే మహిళలతో కొట్టిస్తా !
### కాంగ్రెస్‌లో ప్రత్యర్థులపై విరుచుకుపడ్డ కొండా సురేఖ

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత ఉదయం)**



మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ తనదైన శైలిలో రాజకీయ ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో దేహశుద్ధి చేయిస్తానని ఘాటుగా హెచ్చరించారు. కొంతమంది నేతల తీరుపై కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తాం. ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది, జాగ్రత్త. ప్రతిపక్ష నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారు" అంటూ ఆమె ధ్వజమెత్తారు. కొందరు ..మిగతా 2లో

# జర్మనీలో అసెంబ్లీ ప్రతినిధి బృందం పర్యటన

### వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (ప్రభాత ఉదయం)**



జర్మనీలో తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ , శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నేతృత్వంలోని అసెంబ్లీ ప్రతినిధి బృందం పర్యటన కొనసాగుతోంది. జర్మనీలోని ఫ్రాంకఫేర్ట్‌లో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, తెలుగు ప్రవాసులతో అనుసంధానం అంశాలపై సమావేశం నిర్వహించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడుల అవకాశాలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, ఇన్నోవేషన్, టెక్నాలజీ వంటి వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ గారు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ను భారత కాన్సులేట్ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు.

# డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం.. యువత భవిష్యత్ రక్షణే లక్ష్యం: తెలంగాణ ఈగల్ ఫోర్స్

**నషా ముక్త్ భారత్ దిశగా సమష్టి కార్యాచరణకు పిలుపు యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్ 1908పై విస్తృత అవగాహన**

**డ్రగ్స్ కేసుల దర్యాప్తు, యాంటీ డ్రగ్ స్క్వాడ్ల పనితీరుపై ప్రత్యేక సమీక్ష -- జిల్లాలో మరింత పటిష్టంగా చర్యలు**

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 29(ప్రభాత ఉదయం) :**



జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణ, నివారణ చర్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టడం, డ్రగ్స్ వినియోగం , అక్రమ రవాణాను అరికట్టడం, నషా ముక్త్ భారత్ లక్ష్య సాధన దిశగా పోలీస్ శాఖతో పాటు అన్ని వర్గాలను భాగస్వామ్యాన్ని పెంచడంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు.ఈ సందర్భంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్‌కు ఎస్పీ పి.వి. పద్మజ, మాట్లాడుతూ... డ్రగ్స్ సమస్యను కేవలం పోలీసింగ్ అంశంగా కాకుండా భవిష్యత్ తరాల భద్రతకు సంబంధించిన సామాజిక బాధ్యతగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, పోలీస్ శాఖ, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం లేదా అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం అందించేందుకు అందుబాటులో ఉన్న యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్ 1908 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో పోలీసుల దృష్టికి తీసుకురావడం ద్వారా అనేక నేరాలను ముందుగానే అడ్డుకోవచ్చని, ముఖ్యంగా యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచడంలో ప్రజల సహకారం కీలకమని పేర్కొన్నారు. డ్రగ్స్ కేసుల్లో కేసు నమోదు నుంచి దర్యాప్తు, ఆధారాల సేకరణ, నిందితుల గుర్తింపు, తదుపరి న్యాయపరమైన చర్యల వరకు అనుసరించాల్సిన విధివిధానాలపై పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. దర్యాప్తు సమయంలో ఎదురయ్యే సమస్యలను ఎలా అధిగమించాలి, కేసులను మరింత పకడ్బందీగా ఎలా ముందుకు తీసుకెళ్లాలి అనే అంశాలపై కూడా సూచనలు చేశారు.జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ... జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతను మాదకద్రవ్యాల ప్రభావం నుంచి రక్షించేందుకు విద్యాసంస్థల స్థాయిలో అవగాహన, పర్యవేక్షణ, ముందస్తు నివారణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.జిల్లాలోని వివిధ కళాశాలల్లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ స్క్వాడ్ల పనితీరు, వాటి ద్వారా చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు, విద్యార్థుల భాగస్వామ్యం తదితర అంశాలను ఈగల్ ఫోర్స్ అధికారులు జిల్లా ఎస్పీ ని అడిగి తెలుసుకున్నారు. ఆయా స్క్వాడ్లను మరింత చురుకుగా పనిచేసేలా ప్రోత్సహించడంతో పాటు, అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించడం, విద్యార్థుల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై నిరంతర అవగాహన కల్పించడం వంటి అంశాలపై చర్చించారు.డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో “నివారణ--అవగాహన--నిఘా--చట్టపరమైన చర్యలు” అనే నాలుగు అంశాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని అధికారులు పేర్కొన్నారు. కేవలం కేసులు నమోదు చేయడం మాత్రమే కాకుండా డ్రగ్స్‌కు డిమాండ్ తగ్గించడం, సరఫరా మార్గాలను గుర్తించడం, యువతను ముందుగానే అప్రమత్తం చేయడం, డ్రగ్స్‌కు బానిసైన వారికి అవసరమైన సహాయాన్ని అందించే విధంగా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు.భవిష్యత్తులో జిల్లాలో నిర్వహించనున్న వివిధ కార్యక్రమాల ద్వారా డ్రగ్స్ వ్యతిరేక అవగాహనను మరింత విస్తృతం చేయడంతో పాటు, మాదకద్రవ్యాల అక్రమ రవాణ, వినియోగంపై నిఘాను మరింత పటిష్టం చేయనున్నట్లు సమావేశంలో స్పష్టమైంది. యువత భవిష్యత్తును కాపాడే లక్ష్యంతో పోలీస్ శాఖ చేపట్టే ప్రతి చర్యకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.ఈ సమావేశంలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ - డీఎస్పీ బుచ్చయ్య, గద్వాల్ డి.ఎస్పీ వై. మొగిలయ్య, మరియు ఈగల్ ఫోర్స్ బృందం, గద్వాల్, అలంపూర్, శాంతినగర్ సర్కిల్ అధికారులు, ఎస్సైలు, డి.సి.ఆర్.బి. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంతో కేసులకు సత్వర పరిష్కారం.. సమయం, ఖర్చు ఆదా

**జోగులాంబ గద్వాల జిల్లాలో 11 మంది శిక్షణ పొందిన మధ్యవర్తులు అందుబాటులో**

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ఉచిత మధ్యవర్తిత్వ సేవలు**

**కేసుల్లో రాజీకి అవకాశం ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి జి.నిష్కా పత్రుడు**

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 29(ప్రభాత ఉదయం)**




కోర్టుల్లో కేసులు ఉన్న కక్షిదారులు సమయం,ఖర్చు ఆదా చేసుకునేందుకు మధ్యవర్తిత్వాన్ని సద్వినియోగం చేసుకుని వివాదాలను త్వరగా పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.నిష్కా పత్రుడు సూచించారు.కేంద్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు నిర్వహించనున్న మధ్యవర్తిత్వ 3.ఓ ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కోర్టు హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.నిష్కా పత్రుడు మధ్యవర్తిత్వం ద్వారా కేసులు ఏ విధంగా పరిష్కరించుకోవచ్చు అనే విషయాలను కూలంకషంగా వివరించారు.సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 89 కింద ఉన్న ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాల్లో మధ్యవర్తిత్వం ఒకటని తెలిపారు. మధ్యవర్తిత్వంలో ఒక తటస్థ వ్యక్తి ఇరు పక్షాలతో మాట్లాడి వారి సమస్యలను అర్థం చేసుకుని, ఇద్దరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభించేలా సహకరిస్తారని వివరించారు. మధ్యవర్తి ఎవరి పక్షానా ఉండరని, ఎలాంటి నిర్ణయాన్ని బలవంతంగా రుద్దరని, చివరి నిర్ణయం ఇరు పక్షాల అంగీకారంతోనే జరుగుతుందన్నారు.జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రస్తుతం 11 మంది శిక్షణ పొందిన మధ్యవర్తులు అందుబాటులో ఉన్నారని తెలిపారు.వైవాహిక వివాదాలు, కుటుంబ వివాదాలు,ఆస్తి మరియు భూ వివాదాలు,డబ్బు సంబంధిత వివాదాలు,వ్యాపార వివాదాలు తదితర రాజీకి అవకాశం ఉన్న వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు.కోర్టులో కేసు ఉన్న కక్షిదారులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి మధ్యవర్తిత్వం ద్వారా కేసును పరిష్కరించుకోవాలని కోరితే, నిబంధనల ప్రకారం మధ్యవర్తిని నియమించి ఇరుపక్షాలతో చర్చలు జరిపే అవకాశం కల్పిస్తామని తెలిపారు.అలాగే రాజీకి అవకాశం ఉన్న కేసులను న్యాయమూర్తి మధ్యవర్తిత్వానికి పంపవచ్చని, ఇరువర్గాలు కూడా విజ్ఞప్తి ద్వారా ఈ అవకాశాన్ని కోరవచ్చని తెలిపారు.మధ్యవర్తిత్వం కోరిన కక్షిదారులకు నిబంధనల ప్రకారం మధ్యవర్తిని నియమిస్తామని తెలిపారు.మధ్యవర్తి ఇరువర్గాలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని,ఇద్దరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కుదిరేలా సహకరిస్తారని వివరించారు.మధ్యవర్తిత్వ సమయంలో వెల్లడించిన విషయాలను ఒక పక్షానికి వ్యతిరేకంగా ఉపయోగించలేరని స్పష్టం చేశారు.దీంతో ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ సమస్యలను మధ్యవర్తి ముందు వివరించుకునే అవకాశం ఉంటుందన్నారు.జిల్లాలో ఇప్పటివరకు సుమారు 2,000 కేసులను మధ్యవర్తిత్వానికి అనుకూలమైనవిగా గుర్తించగా, 148 కేసులను ఇప్పటికే న్యాయమూర్తికి పంపించినట్లు తెలిపారు.అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు నిర్వహించే ప్రచార కార్యక్రమంలో మరిన్ని కేసులను మధ్యవర్తిత్వానికి పంపించి,వీలైనన్ని కేసులను సత్వరంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దీంతో కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరు పక్షాల మధ్య సత్సంబంధాలు కొనసాగుతాయని వివరించారు. కాబట్టి జోగులాంబ గద్వాల జిల్లా ప్రజలు కోర్టుల్లో కేసులు ఉన్నప్పుడు రాజీకి అవకాశం ఉన్న వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించండి

మొదటి పేజీ తరువాయి...

తీసుకోవాల్సింది స్పీకర్ మాత్రమేనని సెప్టెంబర్ 8నే హైకోర్టు తేల్చి చెప్పిన విషయం విదితమే. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై కేసులు నమోదయ్యాయి. అయితే, తాము ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసులు నమోదు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ఇప్పటికే జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేసింది.

## ఎన్నికల సంఘంతో... బిజెపి 'మ్యాచ్ ఫిక్సింగ్'

మొదటి పేజీ తరువాయి...

ఆయన అన్నారు. 1930లో లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశాన్ని కూడా రాహుల్ గుర్తుచేశారు. అప్పట్లో పూర్ణ స్వరాజ్యం కోసం కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ ప్రస్తుతం కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందని పార్టీ నేతలకు వివరించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు వస్తున్న సర్ కూడా కాంగ్రెస్ ప్రధానంగా ప్రస్తావిస్తున్న అంశాల్లో ఒకటి. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా కోట్లాది పేర్లు ముసాయిదా జాబితాల నుంచి తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక ప్రకారం, సర్ ప్రక్రియపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక జోషి గత పది నెలల్లో కనీసం 14 సార్లు అభ్యంతరాలు నమోదు చేసినట్లు వెల్లడైంది. ఈ అభ్యంతరాలు ఓటర్ల పేర్ల చేర్పులు, తొలగింపులు, ఫారం-6, ఓటర్ల డేటా నిర్వహణ వంటి అంశాలకు సంబంధించినవిగా ఆ నివేదిక పేర్కొంది. అయితే ఆ అంశంపై ఎన్నికల సంఘం మరో వివరణ ఇచ్చింది. సర్ తో పాటు ఇతర నిర్ణయాలన్నీ ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఆమోదంతోనే జరిగాయని ఈసీ వర్గాలు స్పష్టం చేశాయి. కమిషనర్ల మధ్య అభిప్రాయాలు, ప్రశ్నలు ఉండటం సాధారణ ప్రక్రియలో భాగమేనని పేర్కొంది. సమావేశంలో కాంగ్రెస్ పలు డిమాండ్లను ముందుకు తెచ్చింది. చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. అంతే కాదు, ఇప్పటి వరకు తొలగించినట్లు ఆరోపిస్తున్న 13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని కోరింది. ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని కూడా కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా అంశాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు స్పష్టమవుతోంది. రాబోయే రోజుల్లో ఆ అంశంపై పార్లమెంట్‌తో పాటు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టేందుకు పార్టీ సిద్ధమవుతోంది. ఈ సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరైయ్యారు.కాగా సమావేశానికి ముందు, ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ లతో కొద్దిసేపు ముచ్చటించారు.

## ప్రాజెక్టులకు అనుమతివ్వండి

మొదటి పేజీ తరువాయి...

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పర్యావరణ అనుమతులకు మార్గదర్శకాలను జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఆయా ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని సీఎం తెలిపారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆధ్వర్యంలో చేపడుతున్న టెలీమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాలను ఏర్పాటు త్వరగా పూర్తి చేయడంతో పాటు రెండు, మూడో దశలకు సంబంధించిన యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి జి. వివేక వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటిపారుదల) ఆదిత్యనాథ్ దాస్, సీఎం సెక్రటరీ మాణికర్ణజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారు

నేతలు తమ హద్దులు మీరుతున్నారని, అలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో పార్టీ అంతర్గత పరిణామాలపైనా ఆమె స్పందించారు. కాంగ్రెస్ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులంతా ఐక్యంగా ఉంటేనే పార్టీ ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఆమె సూచించారు.



## గుండె ఆరోగ్యంపై అవగాహనకు నడక

**406 మందికి ఉచిత పరీక్షలు - సేవలో ముందున్న రాందేవ్ రావు ఆసుపత్రి**

**రక్తపోటు, చక్కెర నియంత్రణతో గుండె ఆరోగ్యం - వైద్యుల సూచన**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 29 (ప్రభాత ఉదయం)**

ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాందేవ్ రావు ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన నడక, ఉచిత గుండె వైద్య శిబిరంనిర్వహించారు.కుముదినీదేవి నర్సింగ్ కళాశాల, లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన ఈ నడకను ప్రముఖ సామాజిక కార్యకర్త లక్ష్మీ కమలాకర్ జెండా ఊపి ప్రారంభించారు. నిత్యం వ్యాయామం, సమతుల ఆహారం, ఆరోగ్యకర జీవనశైలితో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ఈ నడకలో మహిళా వైద్య నిపుణులు ఛాయాదేవి, ప్రమోదిని, మంజుల, సుమన్ లత, గుండె వైద్య నిపుణులు ప్రదీప్ రెడ్డి, శ్రీకాంత్, ఇతర విభాగాల వైద్యులు లోకేష్ రెడ్డి, మౌనిక, స్వాతి రెడ్డి, సుమ, వీరభద్ర, పావని, చందన, సుధారాణి, నాగేంద్ర, రోహిత్ నాయక్, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం ఆసుపత్రిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత శిబిరం నిర్వహించి రక్తపోటు, చక్కెర స్థాయి, గుండె పరీక్షలు, ద్విమితీయ ప్రతిధ్వని పరీక్షలు చేసి వైద్య సలహాలు అందించారు. మొత్తం 406 మంది సేవలను పొందారు.ఆసుపత్రి యాజమాన్య మార్గదర్శకంలో వైద్యులు కమలాకర్, ప్రదీప్ రెడ్డి, యోబు ఆధ్వర్యంలో కార్యక్రమాలు విజయవంతమయ్యాయి.



## కూకట్‌పల్లి, బోయిన్‌పల్లిలో 2.1 కిలోల గంజాయి పట్టివేత

**ఇద్దరు నిందితుల అరెస్టు.. బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగింత**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 29 (ప్రభాత ఉదయం)**

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి నుంచి మొత్తం 2.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ అధికారి ఆర్. ప్రవీణ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కూకట్‌పల్లి ధనలక్ష్మి సెంటర్ వద్ద ఎక్సైజ్ శాఖకు చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో గుంటూరుకు చెందిన దీవి క్రాంతి అనే వ్యక్తి వద్ద 105 గ్రాముల గంజాయిని అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చావని అధికారులు విచారించగా, బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన ప్రవీణ్ కుమార్ తనకు గంజాయి ఇచ్చినట్లు క్రాంతి వెల్లడించినట్లు సమాచారం. దీంతో అధికారులు బోయిన్‌పల్లిలోని ప్రవీణ్ కుమార్ ఇంటిపై దాడి చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అతని ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మరో రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో రెండు చోట్ల కలిపి మొత్తం 2.1 కిలోల గంజాయిని అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి దీవి క్రాంతి, ప్రవీణ్ కుమార్‌లపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు నిందితులను తదుపరి చర్యల నిమిత్తం బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ అధికారి ఆర్. ప్రవీణ్ వెల్లడించారు.



## పేదలకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది

**బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు**

**మూడు లక్షల సహాయం అందించిన బండి రమేష్**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 28( ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం లోని బాలానగర్ విభాగానికి చెందిన యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సోను తండ్రి మహమ్మద్ మక్బూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి నియోజకవర్గ బాధ్యులు బండి రమేష్ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందించేందుకు కృషి చేశారు. ఈ మేరకు మూడు లక్షల రూపాయల విలువైన సహాయ పత్రం మంజూరు కాగా, కూకట్ పల్లి కాంగ్రెస్ కార్యాలయం హేమ దుర్గా భవన్ లో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తోందని, అనారోగ్యంతో బాధపడే వారికి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు. అవసరమైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎజాజ్, రంగారావు, శివ, రమణ, నరేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# హస్తాల వీరన్న గుట్ట స్థలాలను కాపాడాలి: బీజేపీ డిమాండ్

**బుద్వేల్, సెప్టెంబరు 29 (ప్రభాత ఉదయం)**

చింతల్మెట్ హస్తాల వీరన్న గుట్ట వద్ద ఉన్న దేవాదాయ శాఖ భుములను కాపాడాలని బీజేపీ గోల్కొండ గోషామహాల్ జిల్లా ఇంచార్జి వై.శ్రీధర్, వనపర్తి జిల్లా ఇంచార్జి బొక్క బాల్ రెడ్డి లు డిమాండ్ చేశారు. చింతల్ మెట్ హస్తాల వీరన్న గుట్ట వద్ద గల గుండం స్థలాన్ని పక్కనే ఉన్న మదర్సా నిర్వాహకులు కబ్జా చేసి ప్రహరీ నిర్మిస్తున్న విషయాన్ని స్థానిక నాయకులు నర్సింగ్ యాదవ్, శ్రీకాంత్ లు అధికారులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆ స్థలాన్ని దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ అధికారిణి రమాదేవి తో పాటు అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య, రాజేం ద్రనగర్ తహసీల్దార్ బొమ్మ రాములు, హైడ్రా అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, ఇప్పటికే హస్తాల వీరన్న గుట్ట దేవాలయం కు చెందిన భూములు అన్యాక్రాం తం అయ్యాయని, రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి దేవాలయం భూమ లను కాపాడి ప్రహరీగోడ నిర్మించేటట్లు చూడాలన్నారు. లేనట్లయితే ఈ సమస్యను బీజేపీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి




చింతల్ మెట్ హస్తాల వీరన్న గుట్ట వద్ద దేవాదాయ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ రమాదేవి, బీజేపీ నాయకులు, స్థానికులు

తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. హస్తాలగుట్ట వీరన్న దేవాలయం ను సందర్శించిన వారిలో బీజేపీ నాయకులు సులిగె విఠల్, గుంజ బాబురావు, వెంకట్ రెడ్డి, విక్రమ్ చారి లు ఉన్నారు.

**రికార్డు ల్లో ఫకీర్ గుట్టగా, ఇనామ్ ల్యాండ్ గా ఉంది : రాజేంద్రనగర్ తహసీల్దార్ బొమ్మ రాములు :**

చింతల్ మెట్ లో హస్తాల వీరన్న గుట్ట ఉన్న స్థలం ఇనామ్ భూమిగా రికార్డు ల్లో ఉందని, ఫకీర్ గుట్ట గా రికార్డు ల్లో ఉందన్నారు. ఆ స్థలంలో ఉన్న గుండం స్థలం లో పక్కనే ఉన్న మదర్సా నిర్వాహకులు ప్రహరీ నిర్మించినట్లు గుర్తించామన్నారు. దేవదాయ శాఖ రికార్డుల్లో ఉన్న వివరాలను చూసి హైడ్రా కు ఫిర్యాదు చేస్తే వారు స్థల వివరాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

**హైడ్రాకు ఫిర్యాదు చేస్తాం: దేవదాయశాఖ అధికారులు**

చింతల్ మెట్ హస్తాల వీరన్న గుట్ట వద్ద ఉన్న గుండం కబ్జా గురించి హైడ్రా కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ రమాదేవి, ఇన్స్ పెక్టర్ కె మోహన్ రెడ్డి లు తెలిపారు. హైడ్రా పరిశీలించాక ఆక్రమ నిర్మాణాలను తొలగించడం జరుగుతుందన్నారు.



నెత్తిన కొంగు లతో ఎండలనుంచి ఉప శమనం పొందుతూ.....

## బాబోయ్ ఎండలు

**బుద్వేల్, సెప్టెంబరు 29 (ప్రభాత ఉదయం)**

రెండు మూడు రోజులుగా నగరంలో ఎండలు విపరీతం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరాంఘర్ చౌరస్తా నుంచి కాటేదాన్, దుర్గా నగర్, మైలార్దేవుపల్లి వైపు వెళ్లే మహిళా ప్రయాణికులు ఆరాంఘర్ బృందావన్ కాలనీ వద్ద బస్సు స్టాప్ లో నెత్తిపై కొంగులు, బ్యాగులు పెట్టుకుని నిలచి ఉండటం కనిపించింది. ఇక్కడ బస్ షెల్టర్ లేకపోవడంతో అమ్మ బాబోయ్ ఎండలు అంటు వారు తమ కొంగులను తలపై పెట్టుకుని ఎండ వేడిమి నుంచి తప్పిం చుకోవడం కనిపించింది.



## మహావీర్ నగర్‌లో భూగర్భ మురుగు పనులకు శ్రీకారం

**శాశ్వత పరిష్కార దిశగా అడుగులు - ఎమ్మెల్యే గాంధీ**

**300 మి.మీ కాలువతో శాశ్వత పరిష్కారం - శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 28 (ప్రభాత ఉదయం)**

ఆల్విన్ కాలనీ 124వ విభాగం ఎల్లమ్మబండలోని మహావీర్ నగర్ లో భూగర్భ మురుగు కాలువ నిర్మాణ పనులకు శేరిలింగంపల్లి శాసనసభ్యులు ఆరెకపూడి గాంధీ శ్రీకారం చుట్టారు.మహావీర్ నగర్, గణేష్ నగర్, ఖాజా నగర్ ప్రాంతాల్లో తరచూ మురుగు నీరు పొంగిపొర్లుతుండటంతో సమస్య పరిష్కారానికి 300 మిల్లీమీటర్ల వ్యాసం కలిగిన కాలువ ఏర్పాటు చేస్తున్నారు. జలమండలి ఆధ్వర్యంలో ఈ పనులు చేపడుతున్నారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పట్వారి శశిధర్, మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, చంద్రకాంత్, ఎరగండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న మురుగు సమస్యకు ఈ పనులతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని, మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో విభాగ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కాలనీవాసులు, యువకులు, టీం పట్వారి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఐ

## కొండాపురంలో విషాదం

**ప్లాస్టిక్ బక్కెట్లో పడి 18నెలల చిన్నారి మృతి**

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 29(ప్రభాత ఉదయం)**



ఇంటి ముందు ఉంచిన నీటి బక్కెట్లో పడి 18నెలల చిన్నారి మృతి చెందింది. ఈ విషాద ఘటన కేటిదొడ్డి మండలం కొండాపురం గ్రామంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపురం గ్రామానికి చెందిన అర్చన మహేష్ దంపతులకు 18నెలల కూతురు రక్షిత ఉంది. తల్లిదండ్రులు చిన్నారిని ఇంటి వద్ద ఉన్న నాన్నమ్మ దగ్గర ఉంచి పొలం పనులకు వెళ్లారు. తర్వాత కొంత సమయానికి చిన్నారి కనిపించకపోవడంతో నాన్నమ్మ.. ఇంటి పరిసర ప్రాంతాల్లో వెతికారు. చివరికి బక్కెట్లో పడి ఉ ఒడటాని గమనించారు. కొన ఊపిరితో ఉన్న చిన్నారిని చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో ప్రాణాలొదిలింది. అర్చన మహేష్ దంపతులకు నాలుగేండ్ల తర్వాత సంతానం కలిగింది. చిన్నారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



## బీజేవైఎం ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దగ్ధం

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 29(ప్రభాత ఉదయం) :**

సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్ళపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్ర బీజేపీ పార్టీ పిలుపు మేరకు మంగళవారం గద్వాల పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి మాట్లాడుతూ... సీఎం పదవిలో ఉన్న వ్యక్తి ప్రజల భక్తి భావాలను, హిందూ దేవతల గౌరవాన్ని దెబ్బతీయడం అత్యంత దురదృష్టకరమని, ఇది సీఎం బాధ్యతా రాహిత్యమైన ప్రవర్తన అని విమర్శించారు. రాముడు ఉత్తరాది దేవుడని, శివుడు దక్షిణాది దేవుడని" మాట్లాడుతూ దేవుళ్లను, సనాతన ధర్మాన్ని కేవలం రాజకీయ లబ్ధి కోసం విడదీయడం సరికాదని అన్నారు.హిందువుల ఆత్మగౌరవాన్ని, మనోభావాలను మరియు నమ్మకాలను దెబ్బతీసే ఇలాంటి వ్యాఖ్యలను బిజెపి పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఓబీసీ మోర్చా కోశాధికారి ఆకారం రమేష్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవదాస్, మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, నాయకులు శ్రీను, బిజెపి సీనియర్ నాయకులు పాండు, గాంజ సాయి, సతీష్, నరసింహ శెట్టి, నాగ మల్లయ్య, రెడప్ప, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు నివేదిక ఇచ్చిన ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి




**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 29(ప్రభాత ఉదయం) :**




గట్టు మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో అదనపు గదుల అక్రమ కూల్చివేత వ్యవహారంలో అప్పట్లో ఉన్న జిల్లా కలెక్టర్‌కు తప్పుడు నివేదిక ఇచ్చిన ఎంఈఓ వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని గట్టు వార్డు సభ్యులు రేవతి వెంకటేష్, మీదింటి తిమ్మప్ప, గాజుల సంతోష్, రంగాస్వామి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.గతంలో అడిషనల్ కలెక్టర్ పురాతన భవనానికి మాత్రమే అనుమతి ఇస్తే, కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా మరో మూడు అదనపు గదులను కూల్చివేశారని తెలిపారు. దీనిపై కలెక్టర్ నివేదిక కోరగా, ఎంఈఓ కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై అన్నింటికీ అనుమతులు ఉన్నాయంటూ అసత్య నివేదిక ఇచ్చారని ఆరోపించారు. నిజాలు దాచిన ఎంఈఓపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



మైలార్ దేవుపల్లి లో పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

## మైలార్దేవుపల్లిలో 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**బుద్వేల్, సెప్టెంబరు 29 (ప్రభాత ఉదయం)**

మైలార్దేవుపల్లి లో ద్విచక్ర వాహనాల ను దొంగిలిస్తున్న ఇద్దరు మైనర్ బాలురను పట్టుకుని వారి నుంచి ఎనిమిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను మైలార్దేవుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ వెల్లడించారు. మైలార్దేవుపల్లి టీఎన్జీవోస్ కాలనీలో రాహుల్ రెడ్డి అనే వ్యక్తి సెప్టెంబరు 20న తన యాక్టీవా 125 వాహనాన్ని ఇంటి ముందు పార్కు చేశాడు. తెల్లవారు జామున లేచి చూసే సరికి యాక్టీవా కనిపించలేదు. అదే రోజు ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో సౌండ్ స్పీకర్ కూడా చోరీకి గురైంది. రాహుల్ రెడ్డి ఫిర్యాదు తో మైలార్దేవుపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ద్విచక్ర వాహనాల ను దొంగిలిస్తున్న ఇద్దరు మైనర్ బాలురను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.




## 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 29(ప్రభాత ఉదయం)**

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కేటిదొడ్డి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. కేటిదొడ్డి ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధరూర్ మండలం నీళ్లహలి గ్రామానికి చెందిన కుర్వ వీరన్న అనే వ్యక్తి నీళహల్లి,పాతపాలెం, ఈర్లబండ పరిసర ప్రాంతాల్లోని రేషన్ కార్డు నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి బొలేరో వాహనంలో తరలిస్తుండగా ఈర్లబండ వద్ద పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి వీరన్నపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

# సేవా రంగంలో పనిచేస్తున్న వారికి బీజేపీ ఆధ్వర్యంలో సన్మాణం



అంగన్వాడీ టీచర్లను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు ఎం కొమురయ్య, మేకల వనితా రెడ్డి లు



అంగన్వాడీ టీచర్లను సన్మానిస్తున్న బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా రెడ్డి

**రాజేంద్రనగర్, సెప్టెంబరు 29 (ప్రభాత ఉదయం)**

ప్రధానమంత్రి నరేంద్రమోడి 25 సంవత్సరాల సుదీర్ఘ పాలనకు గుర్తుగా సేవా రంగాలలో పనిచేస్తున్న వారిని గుర్తించి గౌరవించడం జరుగుతుందని బీజేపీ రం గారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం కొమురయ్య అన్నారు. బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పాండు రంగా నగర్ లో అంగన్వాడీ టీచర్లను సన్మానిం చారు. పాండు రంగా నగర్, సాయి నగర్ కాలనీ, ఎన్ఎం గూడ, భూపాల్నగర్ పరిసర ప్రాంతాలలో అం గన్ వాడీ టీచర్లు గా పనిచేస్తున్న వారికి ఈ సన్మాణం నిర్వహించారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు సేవా సంకల్ప్ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సులిగె వెం కటేశ్, ఎస్ జయానంద్ రెడ్డి, సరితారెడ్డి, కె చంద్రకళ, బాలక్రిష్ట, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గుండెను కాపాడుకుంటేనే.. జీవితానికి భరోసా!

### మారుతున్న జీవనశైలితో పెరుగుతున్న గుండె జబ్బులు.. ఆరోగ్య పరిరక్షణే అసలైన సంపద

### ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఉచితం పరీక్షలు

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 29, (ప్రభాత ఉదయం)**

పరుగులు తీస్తున్న ఆధునిక జీవనశైలిలో మనిషి తన ఆరోగ్యాన్ని పట్టించుకోవడం మరిచిపోతున్నాడు. మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లోపం, పెరుగుతున్న మానసిక ఒత్తిడి, మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలు గుండె ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వయసుతో సంబంధం లేకుండా గుండె జబ్బులు ముప్పుగా మారుతున్న నేపథ్యంలో.. గుండెను కాపాడుకోవడమే జీవితాన్ని కాపాడుకోవడమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. చిన్నపాటి జీవనశైలి మార్పులు, క్రమం తప్పని వైద్య పరీక్షలు, సమతుల ఆహారం, నిత్య వ్యాయామంతో గుండె జబ్బుల ముప్పును గణనీయంగా తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో గల డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుండె ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ నేతృత్వంలో చందానగర్‌లోని ఓమెగా పీఆర్‌కే హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్డియాలజిస్ట్ డాక్టర్ భానుకిరణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గుండె ఆరోగ్య పరిరక్షణపై కీలక సూచనలు చేశారు.



గుండె జబ్బులపై అవగహన కల్పిస్తున్న ముఖ్య అతిథి డాక్టర్ భాను కిరణ్ రెడ్డి..

#### గుండె ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

ఈ సందర్భంగా డాక్టర్ భానుకిరణ్ రెడ్డి మాట్లాడుతూ మానవ శరీరంలో గుండె అత్యంత కీలకమైన అవయవమని, నిరంతరం రక్తాన్ని శరీరంలోని అన్ని భాగాలకు సరఫరా చేస్తూ ప్రాణాలను నిలబెడుతుందని వివరించారు. మారుతున్న జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. మధుమేహం, అధిక రక్తపోటు, అధిక బరువు, శారీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిడి, ధూమపానం, మద్యపానం, కొవ్వు అధికంగా ఉండే ఆహార పదార్థాల వినియోగం గుండె జబ్బులకు ప్రధాన ముప్పు కారకాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడినప్పుడు గుండెకు తగినంత రక్తం, ఆక్సిజన్ అందక గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని వివరించారు. ఛాతిలో అకస్మాత్తుగా నొప్పి లేదా ఒత్తిడి, మెడ, దవడ, భుజాలు, చేతులకు వ్యాపించే నొప్పి, ఆకస్మికంగా చెమటలు పట్టడం, చల్లబడిపోవడం, వికారం, మైకం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని డాక్టర్ సూచించారు. గుండె వేగంగా లేదా అసాధారణంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపించినా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. గుండెపోటు లక్షణాలు కనిపించినప్పుడు సమయం వృథా చేయకుండా అత్యవసర వైద్య సహాయం పొందాలని, స్వయంగా మందులు వేసుకుని పరిస్థితిని ఎదుర్కొనే ప్రయత్నం చేయరాదని స్పష్టం చేశారు. గుండె జబ్బుల నివారణకు ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పులు చేసుకోవాలని వైద్య నిపుణుడు సూచించారు. రోజుకు కనీసం 30 నిమిషాలు నడక, వ్యాయామం చేయడంతో పాటు ధ్యానం, ప్రాణాయామం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవాలని తెలిపారు. ఫాస్ట్‌ఫుడ్, అధిక చక్కెర కలిగిన శీతల పానీయాలు, అధిక కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

#### ముందస్తు పరీక్షలతో గుండెకు రక్షణ

ఆరోగ్యమే మహాభాగ్యమని, గుండె జబ్బులను ముందుగానే గుర్తించేందుకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరమని డాక్టర్ భానుకిరణ్ రెడ్డి తెలిపారు. వైద్యుల సూచనల మేరకు బీపీ, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ పరీక్షలతో పాటు అవసరమైన వారికి 2డీ ఎకో వంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది 'డోంట్ మిస్ ఎ బీట్' (గుండె స్పందనను నిర్లక్ష్యం చేయవద్దు) అనే నినాదంతో గుండె ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, వైద్యుల సలహాలు పాటిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ నిర్వాహకురాలు చావ అరుణ, సంస్థ సిబ్బంది, మహిళలు, కాలనీవాసులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివరామిరెడ్డి, బాలాజీ, ఆసుపత్రి ప్రతినిధులు జాకీర్ హుసేన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థుల ఆధార్ నమోదు మెరుగుపడాలి

### ఆధార్ అప్డేట్ ను నిబంధనల ప్రకారం చేయాలి.

### విద్యార్థుల ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాల ఏర్పాటు.

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 29(ప్రభాత ఉదయం)**

జిల్లాలో విద్యార్థుల ఆధార్ ఎన్రోల్మెంట్ మెరుగుపడాలని, ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ఆధార్ కార్డులను జారీ చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.మంగళవారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో డిఎల్ఏఎంసి (డిస్టిక్ లెవెల్ ఆధార్ మానిటరింగ్ కమిటీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొంతమంది నకిలీ సర్టిఫికెట్స్ తో పలు ప్రయోజనాలు పొందేందుకు ఆధార్ కార్డులలో ఇష్టానుసారం మార్పులు, చేర్పులు చేసుకుంటారని ఇలాంటి వాటికి చోటు లేకుండా నిబంధనల ప్రకారం ఆధార్ కార్డుల అప్డేట్ చేయాలన్నారు. విద్యా సంస్థలతో పాటు అంగన్వాడి కేంద్రాల్లోని పిల్లలందరికీ ఆధార్ కార్డులు ఉండాలన్నారు. ఇందుకోసం అన్ని మండలాల్లోని గ్రామ పంచాయతీలతోపాటు మున్సిపాలిటీలలో బాల ఆధార్ కేంద్రాలు, ఇతర ప్రత్యేక శిబిరాల నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రాన్ని అనుసరించి ఆధార్ కార్డులో పుట్టిన తేదీ నమోదు చేయాలని, పేర్లు, చిరునామా, తదితర మార్పుకు నిబంధనలను అనుసరించి ముందుకెళ్లాలన్నారు. ఆధార్ ఎన్రోల్మెంట్ కిట్స్ కొరతను అధిగమించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశ పౌరుల గుర్తింపుకు ఆధార్ కార్డులకు ఎంతో ప్రాధాన్యత ఉన్నందున ఆధార్ కేంద్రాల నిర్వహకులు, సంబంధిత అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, డిడబ్ల్యుఓ సునంద, డిఇఓ విజయలక్ష్మి, డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, ఎల్డిఎం శ్రీనివాసరావు, డిఎల్పిఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఆధార్ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ నరేష్ చంద్ర, ఈడియం శివ, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు, ఆధార్ కేంద్రాల నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.


క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులు

## 70వ స్కూల్ గేమ్స్‌లో రాజేంద్రనగర్ మండల విద్యార్థుల ప్రతిభ

**బుద్వేల్, సెప్టెంబరు 29 (ప్రభాత ఉదయం)**

70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాజేం ద్రనగర్ జోనల్ లెవల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ లో రాజేంద్రనగర్ మండల విద్యార్థులు సత్తా చాటారు. ఓవరాల్ చాంపియన్లుగా నిలిచారు. జోనల్ లెవల్ లో మొత్తం 24 బహుమతులు ఉండగా, వాటిలో రాజేంద్రనగర్ మండలం విద్యార్థులు 11 బహుమతులు గెలుచుకున్నారు. వాటిలో ఖోఖో అండర్ -14 బాలికలు విన్నర్స్, అండర్ 17 బాలికలు రన్నర్స్, అండర్ 14 బాలురు విన్నర్స్, అండర్- 17 బాలురు రన్నర్స్, అండర్- 14 బాలురు విన్నర్స్, అండర్- 14 బాలురు వాలీబాల్ విన్నర్స్, అండర్ -17 బాలురు వాలీబాల్ విన్నర్స్, అండర్- 17 కబడ్డీ రన్నర్స్, అండర్- 17 బాలికలు కబడ్డీ విన్నర్స్, అం డర్ -14 కబడ్డీ బాలికలు విన్నర్స్, అండర్- 14 బాలికలు వాలీబాల్ విన్నర్స్ గా నిలిచారు. 11 విభాగాలలో విజయం సాదించిన క్రీడాకారులకు రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ శుభాకాంక్షలు తెలియజేశారు. రాజేంద్రనగర్ మండల 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇం చార్జి గాంగ్య నాయక్, బాలస్వామి రెడ్డి, వెంకట్, తరుణ్, మహేందర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఘనంగా ప్రపంచ గుండె దినోత్సవ వేడుకలు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 29(ప్రభాత ఉదయం)**

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రణాళికలను రూపొందించాలని వాటి అమలుకై ప్రత్యేక శ్రద్ధ వహించాలని "అల్ఫోర్స్" విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో అల్ఫోర్స్ విద్యాసంస్థలు , ఇండియన్ మెడికల్ అసోసియేషన్ , రెనీ హాస్పిటల్ వారి సంయుక్త సహకారంతో ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసినటువంటి సిపిఆర్ ప్రదర్శన, శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వేడుకను ప్రపంచ ఆరోగ్య సంస్థ, వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ వారు సంయుక్తంగా నిర్వహిస్తాయని చెప్పారు. గుండె జబ్బుల వల్ల కలిగే ప్రమాదాలు గురించి ప్రజలకు




తెలియజేయడం, నివారణ చర్యలను వివరించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వారు చెప్పారు. రోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం లేదా నడవడం ద్వారా గుండెను జాగ్రత్తగా ఉంచుకోవచ్చని తెలిపారు. యోగా ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని, గుండెను కాపాడుకోవచ్చని చెప్పారు.డాక్టర్ బంగారి స్వామి చైర్మన్, రెనీ హాస్పిటల్స్ మాట్లాడుతూ ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఈ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని గుండె జబ్బుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి వివిధ కార్యక్రమాలను ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తారని వారు చెప్పారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల వారితో సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేతకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.సిపిఆర్ విధానాన్ని డాక్టర్ బి.దీక్షిత్ చాలా చక్కగా వర్ణించాడు. వార్షిక ప్రణాళికలో భాగంగా దీనిని పొందుపరచాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ విధానం ద్వారా ఎంతో మంది జీవితాలను కాపాడవచ్చని వారు చెప్పారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బంగారు స్వామి, చైర్మన్, రెనీ హాస్పిటల్స్, డాక్టర్ ఆకుల శైలజ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా అధ్యక్షురాలు, డాక్టర్ ఎన్.మహేష్ బాబు, కార్యదర్శి, ఐఎంఏ కరీంనగర్, డాక్టర్ వి.నీలిమ, కోశాధికారి, ఐఎంఏ, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ బి.దీక్షిత్, డాక్టర్ సారంగ్, ఆచార్య వడ్లూరి శ్రీనివాస్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, కరీంనగర్, ఎం అరవింద్ బాబు, ప్రతినిధి - రెనీ హాస్పిటల్స్, పవన్ ప్రసాద్, జనరల్ డైరెక్టర్ - రెనీ హాస్పిటల్స్, పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కర్ణాటక ఇచ్చిన హామీ ఏమైంది? జూరాల కాలువల్లో కలుషిత నీటిపై అధికారుల మౌనమెందుకు?

**జోగులాంబ గద్వాల / కృష్ణా, సెప్టెంబర్ 29(ప్రభాత ఉదయం)**

సాగునీటి కోసం రోడెక్కి పోరాటం చేసిన రైతాంగాన్ని పాలకులు, అధికారులు ఏ విధంగా వంచిస్తున్నారో జూరాల ప్రాజెక్ట్ వద్ద నెలకొన్న ప్రస్తుత పరిస్థితులే నిదర్శనంగా మారాయి. తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కర్ణాటక ప్రభుత్వం జూరాలకు 3 టీఎంసీల నీటిని విడుదల చేస్తామని ఇచ్చిన హామీ హాస్యాస్పదంగా మారిందని ఆయకట్టు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

#### 3 టీఎంసీల హామీ ఏమైంది?

ఈ నెల 22న కర్ణాటక నుంచి నీటి విడుదల హామీ తర్వాత, స్థానికంగా కురిసిన వర్షాలతో కలిపి జూరాలకు 1,700 క్యూసెక్కులతో ప్రారంభమైన ఇన్ ఫ్లో క్రమేపీ 7,000 క్యూసెక్కుల వరకు పెరిగింది. కానీ, మంగళవారం సాయంత్రానికి ఆ ప్రవాహం ఒక్కసారిగా 1,500 క్యూసెక్కులకు పడిపోయింది. కర్ణాటక జలాశయాల నుంచి రావాల్సిన అసలు సాగునీటి విడుదలపై నీలి నీడలు కమ్ముకున్నాయి. నిజంగా 3 టీఎంసీల నీరు విడుదలయ్యిందా? లేక ఆ నీరు ఎటు పోయింది? రైతులను మోసం చేసింది కర్ణాటక ప్రభుత్వమా లేక మన నేతలా అని ఆయకట్టు రైతాంగం నిలదీస్తోంది.

#### కాలువల్లో పాచి నీరు -- థర్మల్ ప్రాజెక్ట్ వ్యర్థాలేనా?

మరోవైపు గడిచిన మూడు రోజులుగా జూరాల పరిధిలోని కృష్ణానది జలాలు, కుడి మరియు ఎడమ కాలువల్లో నీరు భయంకరమైన ఆకుపచ్చ (పాచి) రంగులోకి మారి ప్రవహిస్తోంది. కర్ణాటకలోని దేవసూరు థర్మల్ ప్రాజెక్టు నుంచి వదిలిన రసాయన వ్యర్థ నీటినే, మనకు కేటాయించిన సాగునీరుగా చూపి సరిహద్దు దాటించారా అనే తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎండ తీవ్రత, నీటి నిల్వ , వల్ల ఆల్గే బ్లూమ్ ఏర్పడుతుందని నిపుణులు ఒకవైపు చెబుతున్నప్పటికీ, కాలువల్లో అంత విపరీతంగా ఆకుపచ్చ నీరు పారుతున్నా నీటిపారుదల శాఖ అధికారులు మౌనం వహించడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నష్టాలు ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

**పటాన్ చెరు, సెప్టెంబర్ 29(ప్రభాత ఉదయం)**




ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనానికి బానిసై భారీగా డబ్బులు పోగొట్టుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలోచోటుచేసుకుంది.స్థానికులు, మృతుడి తల్లి నర్తారపు లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం నర్తారపు ప్రశాంత్ (23) గత కొంతకాలంగా ఎలాంటి పని చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో సుమారు మూడు నెలల క్రితం ఆన్‌లైన్ బెట్టింగ్‌లో దాదాపు ₹9 లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడు. అప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులు, తీవ్ర మానసిక ఒత్తిడితో తీవ్ర ఆవేదన చెందుతున్నాడు.సోమవారం రాత్రి ఇంట్లోని పడకగదిలోకి వెళ్లి పడుకున్న ప్రశాంత్, మంగళవారం ఉదయం ఎంతకూ బయటకు రాలేదు. అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు గదిలోకి వెళ్లి చూడగా, దూలానికి చున్నీ, నూలు తాడుతో ఉరివేసుకొని విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. కుమారుడి మృతితో తల్లి, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ముగ్గురు మున్సిపల్ ఉద్యోగుల సస్పెన్షన్

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 29(ప్రభాత ఉదయం) :**



గద్వాల మున్సిపాలిటీలో మున్సిపల్ షాపుల అద్దెలకు సంబంధించి వసూలు చేసిన రూ.11.28 లక్షలు సంబంధిత అధికారులు మున్సిపల్ ఖాతాలో జమ చేయకపోవడాన్ని తీవ్ర తప్పిదంగా పరిగణిస్తూ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మంగళవారం తగు చర్యలు చేపట్టారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ ఆఫీసర్ టి.రాజేష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజవర్ధన్, జూనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ షరాఫ్ రాజవర్ధన్ నాయుడులను సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణకు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) నర్సింగరావును విచారణ అధికారిగా నియమించారు. సంబంధిత రశీదు పుస్తకాలు, రికార్డులు, రిమిటెన్స్ వివరాలను పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## అంధకారంలో మిడ్జిల్.. వెలగని హైమాస్ట్ లైట్లు!

### అలంకారప్రాయంగా విద్యుత్ దీపాలు.. చీకట్లోనే ప్రధాన కూడళ్లు

**మిడ్జిల్, సెప్టెంబర్ 29( ప్రభాత ఉదయం)**



మిడ్జిల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలగకపోవడంతో ప్రధాన కూడళ్లు అంధకారంలో మగ్గుతున్నాయి. రాత్రి వేళల్లో వీధుల్లో సరైన వెలుతురు లేక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన లైట్లు అలంకార ప్రాయంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి హైమాస్ట్ లైట్లను వెంటనే వెలిగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలుకోరుతున్నారు.రాత్రివేళల్లో ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి సమస్యనుపరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సర్వాంగ సుందరంగా నూతన కలెకరేట్ భవనం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 29(ప్రభాత ఉదయం)**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల జరగనున్న కరీంనగర్ జిల్లా నూతన కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా చిన్నపాటి లోపానికీ తావులేకుండా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు.కొత్త కలెక్టరేట్ పాా్రరంభోత్సవానికి ముస్తాబవుతోంది. సకల హంగులతో నిర్మితమైన సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయాన్ని బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఇదుకు అధికారయంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. కలెక్టర్ చిత్రామిశ్రాతోపాటు అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, అశ్విని తానాజీ వాఖడే, డీఆర్వో స్వామితోపాటు ఆయా విభాగాల అధిపతులు వివిధ పనుల పర్యవేక్షణలో తలమునకలయ్యారు. చిన్నపాటి పనులు పెండింగ్‌లో ఉండడంతో వాటిని పూర్తి చేయిస్తున్నారు. ముఖ్యంగా లైటింగ్ వ్యవస్థను ప్రత్యేకంగా ఏర్పాటు చేయిస్తున్నారు. గార్డెనింగ్ పనులతోపాటు కొన్ని కార్యాలయాలను ఇంటీరియర్ డిజైన్లతో తీర్చిదిద్దుతున్నారు. గడిచిన రెండు మూడు రోజులుగా ఎక్కువ సంఖ్యలో ఇక్కడికి వచ్చిన వివిధ విభాగాల కార్మికులు వారికి అప్పగించిన పనుల్లో బిజీబిజీగా కనిపిస్తున్నారు. రేయింబవళ్లు శ్రమిస్తూ ఇక్కడి పనులను చకచకా పూర్తి చేసే విధంగా ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి.

**ప్రధాన ద్వారం.. హెలిప్యాడ్..**

పాత కలెక్టరేట్ ఆవరణ రూపురేఖలు మొత్తంగా మారిపోయాయి. 51 కోట్లతో సర్వాంగ సుందరంగా నిర్మించిన నూతన కలెకరేట్ భవనం ప్రజలకు సేవలం దించేందుకు అవసరమైన సౌకర్యాలు, సదుపాయాలతో కొలువుదీరనుంది. ఇప్పటి వరకున్న పాత భవన ప్రధాన ద్వారం స్థానంలో కొత్తగా ఉత్తరం దిశగా నూతనంగా ఆర్చిని ఏర్పాటు చేశారు. వెడల్పాటి సీసీ రోడ్డును నిర్మించారు. పీఎఫ్ ఆఫీస్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు మీదుగా కలెక్టరేట్‌కు రాకపోకల్ని సాగించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ప్రతిమ మల్టీప్లెక్స్ నుంచి భగత్‌నగర్ వెళ్లే దారిలో పడమర దిక్కున రెండు ద్వారాలతో గేట్లు ఉండేవి. కొత్త కలెక్టరేట్‌కు వెళ్లేందుకు అందులో ఒక ద్వారాన్ని మాత్రమే వినియోగించనున్నారు. మరోవైపు కొత్త కలెక్టరేట్ వెనుకాల ఉన్న హెలిప్యాడ్ వద్ద అవసరమైన మరమ్మతులు చేశారు. కొత్తగా రోడ్డును వేశారు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రధాన రహదారులకు ఇరువైపులా విద్యుత్తు తీగలకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. రోడ్డుకిరువైపులా ప్రహరీలకు రంగులను వేసి ఆకర్షణీయంగా ప్రాంగణ పరిసరాల్ని తీర్చిదిద్దుతున్నారు. కలెక్టరేట్ మధ్యలో ఫౌంటెయిన్‌ను ఏర్పాటు చేశారు. ఆహ్లాదకరమైన గార్డెనింగ్‌ను పచ్చిక బయళ్లతో తీర్చిదిద్దారు. కలెక్టరేట్ ప్రధాన గేట్ మొదలు భవనం ఎదుటి భాగాల్లో విద్యుత్ దీపాలు, రంగురంగుల పూలతో అలంకరిస్తున్నారు.

**ఆకట్టుకునేలా.. గ్రౌండ్ ఫ్లోర్..!**

కొత్త కలెక్టరేట్‌లోని గ్రౌండ్‌ఫ్లోర్‌లోని పలు గదులు, ఛాంబర్‌లను ఆకట్టుకునే విధంగా రూపొందించారు. సీఎం ఈ ఫ్లోర్‌లోనే కలెక్టర్ ఛాంబర్‌లోకి వెళ్లి బాధ్యతలను అప్పగించనుండడంతో ఇందుకు అవసరమైన ఏర్పాట్లను దాదాపుగా పూర్తి చేశారు. గ్రౌండ్‌ఫ్లోర్లో కలెక్టరేట్ సిబ్బంది హాల్‌తోపాటు సమావేశ మందిరాలు, వీడియో కాన్ఫరెన్స్ రూమ్, కలెక్టర్ కార్యాలయ గదిని అన్నిరకాల వసతులతో ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. గదుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. సమవేశ మందిరంలో సౌండింగ్ సిస్టమ్, ఫర్నీచర్‌ను సమకూర్చే పనుల్ని చకచకా చేపడుతున్నారు. మొదటి రెండు అంతస్తుల్లో అన్నిరకాల సౌకర్యాలను కల్పించినప్పటికీ అక్కడి గదులను ఆయా శాఖలకు ఇంకా కేటాయించలేదు. రెవెన్యూ విభాగానికి సంబంధించినవి మాత్రం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవం పూర్తయిన తర్వాత ఆయా శాఖలకు పై అంతస్తులో ఉన్న గదులను కేటాయిస్తారు.ప్రారంభోత్సవానికి ముహూర్తం దగ్గర పడటం వల్ల వీటి కేటాయింపును వాయిదా వేశారు. గంటల్లో కొత్త కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి సిద్ధమవుతుండటంతో కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.







# జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

## పటాన్ చెరు పట్టణంలో భారీ స్వాగత తోరణం.. యూటర్న్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు సూచనలు

**పటాన్ చెరు, సెప్టెంబర్ 29(ప్రభాత ఉదయం) :**

మదీనగూడ నుంచి రుద్రారం మీదుగా సంగారెడ్డి వరకు కొనసాగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం ఉదయం పరిశీలించారు. జాతీయ రహదారుల సంస్థ అధికారులతో కలిసి పటాన్ చెరు పట్టణ పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ కేంద్రమైన పటాన్ చెరు పట్టణం ప్రత్యేకత, చారిత్రక ప్రాధాన్యత, అభివృద్ధి ప్రతిష్టను ప్రతిబింబించేలా అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ స్వాగత తోరణాన్ని నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. పట్టణంలోకి ప్రవేశించే వారికి ఆకర్షణీయంగా ఉండేలా స్వాగత తోరణం నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు.అదేవిధంగా స్వాగత తోరణం సమీపంలో యూటర్న్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా ఉంటాయని తెలిపారు. బస్టాండ్ ఎదురుగా ప్రయాణికుల రాకపోకలకు, స్థానిక వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు.

**పనుల్లో జాప్యంపై అసంతృప్తి**

జాతీయ రహదారి విస్తరణ పనులు ఆశించిన వేగంతో కొనసాగకపోవడంపై ఎమ్మెల్యే జిఎంఆర్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులకు స్పష్టం చేశారు. రహదారి విస్తరణతో పటాన్చెరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిర్మాణ పనుల సమయంలో ప్రజలకు, వ్యాపారులకు కనీస ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల సంస్థ ఈఈ శ్రీనివాస్, డిఈ సందీప్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, కుమార్ గౌడ్, శివారెడ్డి, అశోక్, శంకర్, రాజు, రాజన్ సింగ్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో ఘనంగా ప్రారంభమైన ఎస్‌జిఎఫ్ మండల స్థాయి పోటీలు

**లాంచనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**క్రీడలు, క్రీడాకారులకు సంపూర్ణ సహకారం**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 29(ప్రభాత ఉదయం)**





విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా సహకారం అందిస్తే భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ప్రాతినిధ్యం వహించే అవకాశాలు లభిస్తాయని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పటాన్ చెరు మండల స్థాయి క్రీడోత్సవాలను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్యార్థులకు క్రీడల పై ఆసక్తి పెంపొందించేలా నిరంతరం ఉచిత శిక్షణ, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో జాతీయస్థాయి పోటీలకు సైతం ఆతిథ్యం అందించబోతున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు జరగనున్న క్రీడోత్సవాలకు సంపూర్ణ సహకారం అందిస్తూ అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, కుమార్ గౌడ్, శివారెడ్డి, వెంకటేష్, అశోక్, శంకర్, రాజు, రాజన్ సింగ్, వివిధ పాఠశాల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పాలమాకుల ఇనామ్‌షేర్‌లో ఘనంగా గణేష్ నవరాత్రి వేడుకలు

**రూ.32,501లకు లడ్డూను దక్కించుకున్న కోడి ప్రవీణ్**

**శంషాబాద్, సెప్టెంబర్ 29 (ప్రభాత ఉదయం)**





పాలమాకుల ఇనామ్‌షేర్‌లో టీమ్ ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శ్రీ వినాయకుడి నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగాయి. 15 రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి మొక్కులు చెల్లించుకున్నారు. వినాయక నవరాత్రుల ముగింపు సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో గ్రామానికి చెందిన కోడి ప్రవీణ్ ఉత్సాహంగా పాల్గొని రూ.32,501లకు గణనాథుడి లడ్డూను దక్కించుకున్నారు. వేలం పాటలో భక్తులు పోటాపోటీగా పాల్గొనడంతో సందడి నెలకొంది. గణనాథుడి లడ్డూను దక్కించుకోవడం తమకు అదృష్టంగా భావిస్తున్నామని కోడి ప్రవీణ్ తెలిపారు. అనంతరం నిర్వహకులు కోడి ప్రవీణ్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి, పూజలు అందుకున్న గణనాథుడి లడ్డూను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం గణేష్ ఉత్సవాలను గ్రామస్తుల సహకారంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత ఐకమత్యంతో ఉత్సవాలను విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. చివరగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల జయజయధ్వానాల మధ్య నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమంలో యువత, చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిగీతాలు, డీజే సందడి మధ్య గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణంలో వేడుకలు ముగిశాయి.




# లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో ప్రపంచ గుండె దినోత్సవ వేడుకలు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 29(ప్రభాత ఉదయం)**

లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, డిస్ట్రిక్ట్ 320 జీ, ఆధ్వర్యంలో ఆదర్శ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ప్రపంచ హృదయ దినోత్సవాన్ని కరీంనగర్ ముకురంపురలోని ఆదర్శ హాస్పిటల్‌లో నిర్వహించారు.గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, గుండె సంబంధిత వ్యాధులను నివారించడం, అలాగే హృదయ సంబంధిత సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి లయన్ మోర బద్రేశం డిస్ట్రిక్ట్ గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డా. అరుణ్ కటారి కార్యక్రమానికి ఛైర్మన్‌గా వ్యవహరించారు.ప్రత్యేక హార్ట్ హెల్త్ ప్యాకేజ్లో భాగంగా పాల్గొన్న వారికి ఉచిత షుగర్ టెస్ట్, ఇ సి జి, టూ డీ ఎకో ప్రత్యేక ప్యాకేజ్ సేవలు అందించారు.డా. గోవింద్ ఝూదవ్, సీనియర్ కార్డియాలజిస్ట్, గుండె ఆరోగ్యం, నివారణ చర్యలు , క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సిన ఆవశ్యకతపై విలువైన సూచనలు అందించారు. సమాజానికి వైద్య సేవలందిస్తున్న వైద్యులు మరియు వైద్య సిబ్బందిని ఈ సందర్భంగా సత్కరించారు. అలాగే ఆదర్శ హాస్పిటల్ బృందం డిస్ట్రిక్ట్ గవర్నర్‌ను సత్కరించింది.క్లబ్ ప్రెసిడెంట్ లయన్ మైడం శివకాంత్ పటేల్ తో పాటు బట్టు వినోద్, మెతుకు కృష్ణ చైతన్య, ముక్క శరత్ కృష్ణ, ఐతా సూరజ్, సింగమరాజు, సనా వేణు మరియు గుడిసె రాజేంద్ర ప్రసాద్‌లి కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు తమ సహకారం అందించారు.ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, గుండె సంబంధిత ప్రమాద కారకాలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా మెరుగైన గుండె ఆరోగ్యాన్ని సాధించవచ్చని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్యులు, ఆదర్శ హాస్పిటల్ యాజమాన్యం, లయన్స్ సభ్యులు సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సమాజ సేవలో భాగంగా ప్రజా ఆరోగ్యం మరియు సంక్షేమానికి సంబంధించిన అనేక సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ముందుకు సాగుతోంది.



# కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నాయకుల ధర్నా

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 29(ప్రభాత ఉదయం) :**

బిజెపి అనుబంధ సంస్థగా ఎన్నికల కమిషన్ తయారైందని ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కరీంనగర్ లోని .కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. అంతకుముందు నగరంలో ఇందిరా గాంధీ చౌరస్తా నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు కాంగ్రెస్ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ అంబేద్కర్ ఇచ్చిన ఓటు హక్కు మోడీ సర్కార్ కాలరాస్తుందని ఆరోపించారు. మానకొండూరు ఎమ్మెల్యే రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో అవకతకులు జరుగుతున్నాయని అభ్యంతరాలు చెప్పిన వినకుండా ఇష్టం వచ్చిన నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఈ ధర్నా కరీంనగర్ శాసనసభ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేంద్ర రావు, సుడా మాజీ చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ నరసయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




# తెలంగాణకు ఎస్ఆర్ఆర్ ఎన్సీసీ క్యాడెట్ ప్రాతినిధ్యం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 29(ప్రభాత ఉదయం)**

ఆగ్రాలోని పారాట్రూపర్ ట్రైనింగ్ స్కూల్‌లో నిర్వహించిన పారా బేసిక్ కోర్సులో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించి కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్సీసీ క్యాడెట్ జి. సంతోష్ ప్రతిభ కనబరిచాడు. నిజామాబాద్ గ్రూప్, 9(టి) బెటాలియన్ కరీంనగర్ నుంచి ఎంపికైన ఏకైక క్యాడెట్‌గా సంతోష్ నిలిచాడు. కళాశాలలో బీఏ (హెచ్‌పీపీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న సంతోష్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ తరఫున ఆగ్రాలోని ఏఏటీఎస్, పీటీఎస్‌లో 12 రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో పాల్గొన్నాడు.శిక్షణలో భాగంగా ఆగ్రా కోట, ఏడీఆర్డీఈ (డీఆర్డీఓ) , తాజ్‌మహల్, ఎన్సీసీ ఎయిర్‌వింగ్ హ్యాంగర్‌లను సందర్శించాడు. సెప్టెంబర్ 16 నుంచి 22 వరకు మూడు పారా జంప్‌లను విజయవంతంగా పూర్తి చేశాడు. సెప్టెంబర్ 24న ఏడీజీ మేజర్ జనరల్ గౌరవ్ గౌతమ్ సమక్షంలో పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. సంతోష్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. రామకృష్ణ, ఎన్సీసీ అధికారి కెప్టెన్ రేల్ల సంజీవ్, అధ్యాపకులు అభినందించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608